అసైన్డ్ భూముల్లో అక్రమ కట్టడాలు

- నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- యథేచ్ఛగా కొనసాగుతున్న నిర్మాణాలు

7లో

పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ ఖాళీ

- నేను ఎవరికీ భయపడను
- రైతుబంధుపై దుష్ప్రచారం చేస్తున్నారు
- మంత్రి కొండా సురేఖ
- రాహుల్ ప్రధాని కావాలన్నదే ఆకాంక్ష : జగ్గారెడ్డి



సంగారెడ్డి నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండా సురేఖ

సంగారెడ్డి / కొండాపూర్, ఏప్రిల్ 14 : పార్లమెంట్ ఎన్నికల తరువాత బీఆర్ఎస్ పార్టీ పూర్తిగా ఖాళీ కావడం ఖాయమని అటవీ పర్యావరణ, దేవాదాయశాఖ మంత్రి, మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కొండా సురేఖ అన్నారు. కొండాపూర్ మండలం మల్కాపూర్ శివారులో ఓ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నిర్మలారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డితో కలిసి మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాజకీయంగా తాను ఎవరికీ భయపడలేదన్నారు. బీఆర్ఎస్ నాయకులు రైతుబంధుపై దుష్ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. రాజకీయ ప్రస్థానంలో ఎన్నో అక్రమ కేసులతో జైలుకెళ్లామన్నారు. జనాల్లో ఉన్నామని, అందుకే ప్రజలు అదరించి మళ్లీ పట్టం కట్టారన్నారు. ఎంపీపీ స్థాయి నుంచి మంత్రి వరకు ఎదిగానన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు నెలల తరబడి ఈఎంఐల మాదిరి రైతులకు రైతుబంధు వేసిన విషయాన్ని గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన మూడు నెలల్లోనే 99శాతం మంది రైతులకు ఒకేసారి రైతుబంధును వేసామని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేత కేటీఆర్‌కు వారు ఇచ్చిన వంద హామీలు గుర్తుకు రావడం లేదన్నారు. కానీ కాంగ్రెస్ ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలలో ఐదు గ్యారంటీలను 100 రోజుల్లోనే అమలు చేసినా తమను విమర్శించడం విడ్డూరంగా ఉన్నదన్నారు. కాంగ్రెస్‌ను ప్రశ్నించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని, పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఖాళీ అవుతుందన్నారు. గజ్వేల్, సిద్దిపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ మెజార్టీ సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. పేదల సంక్షేమంతో పాటు అభివృద్ధికి పాటుపడే ఏకైక పార్టీ కాంగ్రెస్సే అన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వర్క్‌మైండ్ ఉన్న వ్యక్తి అని, ఈ ఎన్నికల్లో సంగారెడ్డి నుంచి మంచి మెజారిటీ సాధించడం ఖాయమన్నారు. మెదక్ గడ్డ నుంచి పోటీ చేసిన దివంగత ఇందిరాగాంధీ అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారని గుర్తుచేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును గెలిపిస్తే రాహుల్ గాంధీ నానమ్మ గెలిచినట్టేనని సంతోషపడతారన్నారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన నీలం మధుముదిరాజ్‌ను గెలిపించుకునే బాధ్యత అన్ని వర్గాలపై ఉన్నదన్నారు. కాంగ్రెస్ గెలుపు కోసం కార్యకర్తలు 30 రోజులు శక్తివంచన లేకుండా కృషి చేయాలన్నారు.

రాహుల్ ప్రధాని కావాలన్నదే అందరి ఆకాంక్ష : జగ్గారెడ్డి

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ప్రధాన మంత్రి కావాలన్నది దేశంలోని ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త ఆకాంక్ష అని మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. దివంగత ఇందిరాగాంధీ ప్రాతినిధ్యం వహించిన మెదక్ పార్లమెంట్‌కు ఘనచరిత్ర ఉన్నదన్నారు. మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధుకు సంగారెడ్డి అసెంబ్లీ సెగ్మెంట్‌లో లక్ష మెజారిటీ లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యకర్తలందరి కృషితో ఈ మెజారిటీ సాధిస్తామన్నారు. ఎన్నికల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణ మాఫీని అమలు చేయనున్నదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రచారం కల్పించాలని జగ్గారెడ్డి కోరారు. డీసీసీ అధ్యక్షురాలు, ఐఐసీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను బూత్‌ల వారీగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. అభ్యర్థి నీలం మధును భారీ మెజారిటీతో గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉన్నదన్నారు. టీపీసీసీ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ కుసుమ్‌కుమార్ మాట్లాడుతూ తెలంగాణ ఇచ్చింది సోనియాగాంధీ అని ప్రతీ కార్యకర్త గుర్తుంచుకోవాలన్నారు. ఆమె నిర్ణయంతోనే మన దగ్గర ఐఐటీ ఏర్పడిందన్నారు. పేదలందరికీ పట్టా భూములు ఇవ్వడం, ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇవ్వడం సోనియాగాంధీ వల్లే సాధ్యమవుతుందన్నారు. ఈ సమావేశంలో పార్లమెంట్ అభ్యర్థి నీలం మధు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ అనంతకిషన్, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు ఆంజనేయులు, నాయకులు రఘుగౌడ్, రాంరెడ్డి, షఫీ, జార్జ్, సత్తెన్న, బుచ్చిరాములు, సిద్ధు, ప్రభు, మోతీలాల్, కూన సంతోష్, బల్వంత్‌రెడ్డి, కిరణ్‌గౌడ్, శ్రీరామ్ తదితరులు పాల్గొన్నారు.



కొండాపూర్ మండలం మల్కాపూర్‌లో నిర్వహించిన సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో చేతి గుర్తుకే ఓటు వేయాలని కోరుతున్న మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి తదితరులు

నేడు సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లోకి మదన్‌రెడ్డి

- ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి కూడా
- వారివెంట వెళ్లే వారి విషయంలో గోప్యత

నర్సాపూర్/మనోహరాబాద్, ఏప్రిల్ 14: నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి సోమవారం సీఎం రేవంత్‌రెడ్డి స్వగృహంలో ఆయన సమక్షంలో కాంగ్రెస్‌లో చేరనున్నారు. ఆయనతో పాటు ఫుడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఎలక్షన్‌రెడ్డి కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్‌ను వీడే వారు ఎవరనే విషయమై కొంత గోప్యత నెలకొన్నది. ఆయనతో పాటు పీఏసీఎస్ చైర్మన్లు ముగ్గురు, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్‌తో పాటు పలు గ్రామాల మాజీ సర్పంచులు, ఇతర నాయకులు వెళ్లే అవకాశమున్నట్లు తెలిసింది. వీరితో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు కూడా ఒకరిద్దరు కాంగ్రెస్‌లో చేరే అవకాశమున్నట్లు సమాచారం. అయితే, మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే సునీతారెడ్డి మదన్‌రెడ్డితో వెళ్లే వారిని గుర్తించి బీఆర్ఎస్ పార్టీని వీడకుండా ప్రయత్నిస్తున్నారు. అదే సమయంలో మదన్‌రెడ్డి పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలతో కాంగ్రెస్‌లో చేరేందుకు పావులు కదుపుతున్నారు.





అంబేడ్కర్‌కు ఘన నివాళి

షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మెదక్ కలెక్టరేట్‌లో ఆదివారం నిర్వహించిన అంబేడ్కర్ జయంతి కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సంగారెడ్డి పట్టణంలోని పాతబస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి కలెక్టర్ వల్లూరి క్రాంతి పూలమాల వేశారు. అంబేడ్కర్ భవన్ ప్రాంగణంలోని విగ్రహానికి మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ నివాళులర్పించారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు కలిగించొద్దు

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

7లో

దూకుడు



నామినేషన్లకు ముందే పార్లమెంట్ ఎన్నికల ప్రచారం ఊపందుకున్నది. ప్రధాన పార్టీలు సైతం తమ అభ్యర్థులను ప్రకటించడంతో ప్రస్తుతం వారంతా ప్రజాక్షేత్రంలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. పరస్పర ఆరోపణలు, వాగ్దానాలతో పాటు తమదైన శైలిలో ప్రచారం చేస్తున్నారు. ఈనెల 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ మొదలవుతున్న నేపథ్యంలో ప్రచార ఘట్టం తారాస్థాయికి చేరనున్నది.

- నామినేషన్లకు ముందే ప్రచార హోరు
- నియోజకవర్గాలు, మండలాలవారీగా మీటింగ్‌లు
- పోటాపోటీగా ప్రచార రథాల ఆర్భాటం
- వ్యక్తులు, సంఘాల వారీగా ముఖాముఖీ
- ఈనెల 18 నుంచి 25వరకు నామినేషన్ల స్వీకరణ
- మెదక్ పార్లమెంటు పరిధిలో ఎన్నికల జోష్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఏప్రిల్ 14: మెదక్ లోక్‌సభ సెగ్మెంట్‌లోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో ఎన్నికల జోష్ నెలకొన్నది. పోలింగ్‌కు నెల రోజుల సమయం ఉన్నప్పటికీ అభ్యర్థులు ఊరూవాడా చుట్టేస్తున్నారు. నామినేషన్లు సమర్పించడానికి ముందే అన్ని మండలాల్లో పర్యటించాలని నడుంబిగించారు. నామినేషన్ల పరిశీలన తర్వాత తమ అధినాయకులతో బహిరంగ సభలు తలపెట్టాలనే యోచనలో ఉన్నారు. మూడు ప్రధాన పార్టీల అభ్యర్థులూ ఇదే వైఖరితో కనిపిస్తున్నారు.

హరీశ్, వెంకట్రామారెడ్డి జోరు

మెదక్ సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ పార్టీ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నది. రాష్ట్రంలోనే బీఆర్ఎస్ పార్టీ గెలుచుకునే మొదటి స్థానంగా మెదక్ ఉంటుందని ఆ పార్టీ శ్రేణులు ధీమాతో ఉన్నారు. అయితే 2004, 2009, 2014లో తెలంగాణ ఉద్యమ నేపథ్యం, 2014 ఉపఎన్నికలు, 2019లో అధికారంలో ఉన్న పార్టీగా బీఆర్ఎస్‌కు కలిసొచ్చింది. ఈసారి అధికారాన్ని కోల్పోవడం కాస్త ఇబ్బందిగా భావిస్తున్నారు. ఈ లోటును పూడ్చడానికి మాజీమంత్రి హరీశ్‌రావు తానే అభ్యర్థి అన్నట్లుగా ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో ఉన్న మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డితో కలిసి జోరుగా పర్యటనలు సాగిస్తున్నారు. మెదక్ సెగ్మెంట్ పరిధిలోని ఏడు స్థానాలుంటే ఆరుచోట్ల బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉండడం తమకు కలిసి వస్తుందని భావిస్తున్నారు. ఇప్పటికే అన్ని నియోజకవర్గాల్లోనూ సగానికి పైగా మండలాల్లో బీఆర్ఎస్ శ్రేణులతో మమేకమై సమావేశాలు నిర్వహించారు. నామినేషన్లు ముగిసే నాటికి అన్ని మండలాలపై ఫోకస్ చేస్తున్నారు. చేరికల సంగతి పక్కనబెడితే పార్టీలో అసంతృప్తులు లేకుండా జాగ్రత్త పడుతున్నారు.

చేరికలపై కాంగ్రెస్ ఫోకస్

ఈ లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలో మెదక్ అసెంబ్లీ నియోజకవర్గంలో మాత్రమే కాంగ్రెస్ పార్టీ విజయం సాధించింది. దీంతో తమకు అనుకూలంగా లేని నియోజకవర్గాలపై ఆ పార్టీ పెద్దలు దృష్టిసారించారు. ఎట్టకేలకు ఆ పార్టీ అభ్యర్థిగా నీలం మధును ప్రకటించినప్పటికీ ఆయన ప్రచారంలో మాత్రం పుంజుకోలేదు. సిద్దిపేట, గజ్వేల్, సంగారెడ్డి, నర్సాపూర్, పటాన్‌చెరు, దుబ్బాక నియోజకవర్గాల్లో తమ బలాన్ని పెంచుకోవడానికి నిమగ్నమయ్యారు. ఇటీవలే పలువురు ముఖ్యులు బీఆర్ఎస్, బీజేపీ నుంచి కాంగ్రెస్ గూటికి వెళ్లారు. తాజాగా గజ్వేల్‌లోనూ మంత్రి కొండా సురేఖ ఆధ్వర్యంలో పార్టీ మీటింగ్ నిర్వహించారు. ఇక మెదక్ లోక్‌సభకు 18 సార్లు ఎన్నికలు జరిగితే ఇందులో 9 దఫాలుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించిన రికార్డు ఉంది. ఇందిరాగాంధీ కూడా మెదక్‌లో విజయం సాధించి ప్రధానమంత్రిగా కొనసాగారు. ఇందిరా నియోజకవర్గంగా పేరున్న మెదక్‌ను మరోసారి తమ ఖాతాలో వేసుకునేందుకు కాంగ్రెస్ పార్టీ సర్వశక్తులూ ఒడ్డడానికి సిద్ధమైనట్లుగా తెలుస్తున్నది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్యేలు తూర్పుజగ్గారెడ్డి, మైనంపల్లి హనుమంతరావు తమ పార్టీ అభ్యర్థి నీలం మధు వెన్నంటే ప్రచారం చేస్తున్నారు.

ప్రచారంలో రఘునందన్ నిమగ్నం

అందరికంటే ముందుగా బీజేపీ అభ్యర్థిగా ఖరారైన మాధవనేని రఘునందన్ రావు ముందస్తుగానే ప్రచారంలో దిగారు. అభ్యర్థిగా తనకే అవకాశం ఉంటుందనే ధీమాతో ప్రచార రథాలు తయారు చేయించారు. తన పేరు ఖరారైన వెంటనే ప్రజాక్షేత్రంలో ప్రచారం ప్రారంభించారు. నియోజకవర్గాలు, మండలాల వారీగా సమావేశాలు నిర్వహించడమే కాకుండా కులాలు, వర్గాల వారీగా కూడా ముఖాముఖీ సమావేశమవు తున్నారు. పార్లమెంటు ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన అనుభవం ఉండడంతో ఈసారి జాగ్రత్త వహిస్తున్నారు. దుబ్బాక ఉపఎన్నికల్లో బీజేపీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చవిచూశారు. పార్లమెంటు ఎన్నికలను ఆయన ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. ఎలాగైనా ఎంపీగా గెలవాలనే పట్టుదలతో పర్యటిస్తున్నారు. 1999లో ఆలె నరేంద్ర బీజేపీ నుంచి ఈ స్థానంలో గెలుపొందారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, మాజీ మంత్రి ఈటల రాజేందర్, కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డితో పాటు ముఖ్యనేతలు రఘునందన్ తరఫున పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

ఆ చెరువు ముంచేస్తోంది..!

- అమీన్‌పూర్ పెద్దచెరువుకు అలుగు దిక్కులేదు
- మురికి కూపంలా మారినా చర్యలు శూన్యం
- నీట మునిగిన ప్లాట్ల యజమానుల ఆందోళన



పెద్దచెరువు నీటిలో మునిగిన ప్లాట్ల వద్ద ఫ్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

పటాన్‌చెరు, ఏప్రిల్ 14: అమీన్‌పూర్ పెద్దచెరువుకు అలుగు, తూము దిక్కులేదని, మురుగునీటితో నిండి వేలాది కుటుంబాలను ముంచేసిందని ముంపు బాధితుల జేఏసీ నాయకులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆదివారం పెద్దచెరువు ముంపు బాధితుల జేఏసీ సమావేశానికి పెద్దసంఖ్యలో ప్లాట్ల యజమానులు హాజరై నిరసన వ్యక్తం చేశారు. మురుగునీరు దిగువకు వెళ్లేందుకు దారి లేక అనేక కాలనీలు జలమయమై, వేలాది కుటుంబాలకు చెందిన ప్లాట్లు నీటిపాలైనా అధికారులు చోద్యం చూస్తున్నారు తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. 93.5 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న పెద్దచెరువుకు ఏకంగా 465 ఎకరాల ఎఫ్‌టీఎల్ ఉందని అధికారులు అనాలోచితంగా నిర్ధారించడం ఎంతవరకు సమంజసమన్నారు. 30 ఏళ్ల క్రితం కొనుగోలు చేసిన ప్లాట్లు సైతం చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, శిఖంలో ఉన్నాయని, ఇంటి అనుమతులు ఇవ్వకుండా వేధిస్తున్నారని వాపోయారు. ఐదేళ్ల నుంచి చుక్క నీటిని అలుగులు, తూముల ద్వారా కిందికి వదలకపోవడంతో వేలాది ప్లాట్లు నీట మునిగాయని ఆగ్రహం వ్యక్తంచేశారు. దర్శన్‌నగర్, పాంచజన్య, వెదిరి, వాణినగర్, సూర్యచంద్ర ఎన్‌క్లేవ్, విష్ణుపురి, వినాయకనగర్, వారాహి, ఆర్‌కే 1, 2, 3 తదితర లేఅవుట్లలో సగానికిపైగా ప్లాట్లు మురుగు నీటిలో కూరుకుపోయాయన్నారు. చిరుఉద్యోగులు, కార్మికులు, మధ్యతరగతి వారు అప్పుచేసి కొనుగోలు చేసిన ప్లాట్లు ఎందుకు పనికి రాకుండా పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఐదువేలపైచిలుకు ముంపు బాధితులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి న్యాయం చేయాలని కోరామన్నారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ అధికారులతో నివేదికలు తెప్పించుకుని న్యాయం చేస్తామని హామీఇచ్చారన్నారు. ఇరిగేషన్, హెచ్‌ఎండీఏలో కొందరు అధికారులు చేసిన తప్పిదం వేలాది కుటుంబాలకు శాపంలా మారిందని చెప్పారు. ఏళ్ల తరబడి మురుగునీటిని నిల్వ చేయడంతో దుర్గంధం వ్యాపించి చుట్టుపక్కల కాలనీల ప్రజలు నరకం చూస్తున్నారన్నారు. ప్రజారోగ్యం, వేలాది ప్లాట్ల యజమానులు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని దిగువకు నీటిని వదలాలని డిమాండ్ చేశారు. వచ్చే వర్షాకాలం ఇదే పరిస్థితి కొనసాగితే అనేక కాలనీలు నీట మునిగే ప్రమాదం పొంచి ఉందని చెప్పారు. విచారణకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేసినా హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్ శాఖలు చర్యలు తీసుకోవడంలో తాత్సారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఈ కార్యక్రమంలో పెద్దచెరువు ముంపు బాధిత కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు, ముంపు బాధితుల జేఏసీ అధ్యక్షుడు చిరునామా సత్యనారాయణ, నాయకులు బ్రహ్మానందరావు, విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటప్పయ్య, సాయిబాబు, కేఎల్.మోహన్, సయ్యద్‌అహ్మద్, పుండరీకాక్షశర్మ, ఏ.బాలాజీ, శేషసాయి, నాగేశ్వరావు, వేణు, ధర్మారావు, రతన్‌లాల్, జీవ తదితరులు పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ పార్టీ మూల్యం చెల్లించక తప్పదు

- సుల్తాన్‌పూర్ కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలి : మాజీ మంత్రి హరీశ్‌రావు

జహీరాబాద్/నారాయణఖేడ్, ఏప్రిల్ 14 : కాంగ్రెస్ ప్రభుత్వం హామీల అమలను విస్మరించిందని, ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. జహీరాబాద్, నారాయణఖేడ్ పట్టణాల్లో ఆదివారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో తెలంగాణ వ్యాప్తంగా నిర్వహిస్తున్న బహిరంగ సభలకు ప్రజల నుంచి పెద్దఎత్తున స్పందన వస్తుందన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు కోతలు పెడుతున్నారన్నారు. మైనారిటీలకు కేబినెట్‌లో అవకాశం కల్పించలేదని విచారం వ్యక్తం చేశారు. జహీరాబాద్ ప్రాంతానికి సంగమేశ్వర పథకం ద్వారా కాళేశ్వరం నుంచి సాగునీటిని తెచ్చేందుకు తమ ప్రభుత్వం ప్రయత్నించగా, ఈ పథకాన్ని పూర్తిగా రద్దు చేశారన్నారు. రేపు సుల్తాన్‌పూర్‌లో నిర్వహించే కేసీఆర్ బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎమ్మెల్యే మాణిక్‌రావు, మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, నాయకులు భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్‌లో మాట్లాడుతున్న హరీశ్‌రావు

విద్యుదాఘాతంతో ఆవు మృతి

వట్‌పల్లి, ఏప్రిల్ 14: విద్యుదాఘాతంతో ఆవు మృతిచెందింది. మండల పరిధిలోని సర్కార్‌కంచ తండాకు చెందిన మున్నానాయక్‌కు చెందిన ఆవు రక్షణ కవచం లేని ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లి ప్రమాదానికి గురై మృతిచెందింది. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ ఫెన్సింగ్ లేకపోవడంతోనే ప్రమాదం జరిగిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.



మృతిచెందిన ఆవు

రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి

మేడ్చల్ టౌన్, ఏప్రిల్ 14: మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతిచెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ జిల్లా చిన్నశంకరంపేట మండలం సూరారం గ్రామానికి చెందిన సిద్ధిరాములు(58) ఆదివారం బైక్‌పై మేడ్చల్ పట్టణం నుంచి చెక్ పోస్టు వైపు వెళ్తుండగా... జాతీయ రహదారిపై వెనుక నుంచి వస్తున్న మినీ బస్సు ఢీకొట్టింది. దీంతో సిద్ధిరాముల తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. అలాగే మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ గ్రామానికి చెందిన రామ్‌మురాట్(29) ఆదివారం సాయంత్రం బైక్‌పై తన కూతురుని తీసుకుని పని నిమిత్తం మేడ్చల్‌కు వచ్చి తిరిగి వెళ్తున్నాడు. ఈ క్రమంలో పట్టణంలోని ముబారక్ హోటల్ సమీపంలోని జాతీయ రహదారిపై వెనక నుంచి వస్తున్న టిప్పర్ ఢీకొట్టింది. ఈ ఘటనలో రామ్‌మురాట్ అక్కడికక్కడే మృతిచెందాడు. కూతురుకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాలకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మార్చురీలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని సీఐ సత్యనారాయణ తెలిపారు.





సిద్ధిరాములు, రామ్‌మురాట్ మృతదేహాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి, మరొకరికి గాయాలు

వర్గల్, ఏప్రిల్ 14: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకున్నది. గౌరారం ఎస్ఐ శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్ మండలం అంబర్‌పేట గ్రామానికి చెందిన మన్నె నరింహులు(55) వరుసకు అన్న అయిన దశరథతో కలిసి (టీఎస్ 36 కే4827) నెంబరు గల బైక్‌పై వర్గల్ గ్రామానికి వెళ్లి తిరిగి వస్తున్నారు. వర్గల్ గ్రామ శివారులోని అనంతకుంట కట్ట వద్ద బైక్ అదుపు తప్పి ఎడవవైపు ఉన్న విద్యుత్ స్తంభానికి ఢీకొట్టింది. ఈ ఘటనలో నర్సింహులు తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతిచెందాడు. కీసర దశరథకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం గజ్వేల్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు మన్నె స్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయలేదని వ్యక్తి ఆత్మహత్య

దుబ్బాక, ఏప్రిల్ 14: ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయలేదనే మనస్తాపంలో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దుబ్బాక ఎస్ఐ గంగరాజు తెలిపిన వివరాల ప్రకారం దుబ్బాక మండలం గంభీర్‌పూర్ గ్రామానికి చెందిన నీరటి రాజశేఖర్(33) సిద్దిపేటలోని ఒక వెంచర్‌లో 150 గజాల ప్లాట్‌ను నాలుగు నెలల క్రితం కొనుగోలు చేశాడు. ఆ వెంచర్‌కు చెందిన వ్యక్తులు ఎంతరూ రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో ఆదివారం సూసైడ్ నోట్‌లో నలుగురి పేర్లు రాసి, రాజశేఖర్ ఇంటిలోని దూలానికి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నోట్ ప్రకారం వారిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తప్పుడు కూతలు కూస్తున్న వారిని చట్టపరంగా శిక్షిస్తాం

- రఘునందన్ ఘన చరిత్ర ఏంటో అందరికీ తెలుసు
- బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి


వర్గల్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

వర్గల్, ఏప్రిల్ 14: రాజకీయ లబ్ధికోసం తనపై తప్పుడు కూతలు కూస్తున్న వారిని వదిలే ప్రసక్తి లేదని, వారిని చట్టపరంగా శిక్షిస్తామని బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి అన్నారు. ఆదివారం వర్గల్ మండలం గౌరారంలో పార్టీ మండలాధ్యక్షుడు వేలూరి వెంకట్‌రెడ్డి అధ్యక్షతన ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భగా వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ కొందరు రాజకీయ లబ్ధికోసం తనను తప్పుడు కేసుల్లో ఇరికించాలని చూస్తున్నారని, వారికి భయపడే వ్యక్తిని కాదన్నారు. బీజేపీ అభ్యర్థి రఘునందన్ ఉడుత ఊపులకు భయపడేది లేదని, రఘునందన్ ఘన చరిత్ర ఏంటో ప్రజలందరికీ తెలుసన్నారు. దుబ్బాక ఉప ఎన్నికలో వంద అబద్దాలు ఆడిన రఘునందన్‌ను దుబ్బాక ఓటర్లు 54 వేల ఓట్ల తేడాతో ఓడించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో గెలిచే సత్తా లేకనే తనపై కలెక్టర్, ఎస్పీకి, ఈడీ, సీబీఐ, ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ సీఎం కేసీఆర్ సూచనలతోనే తాను బరిలో ఉన్నానని, విజయం బీఆర్ఎస్‌దేనన్నారు. అనంతరం రాష్ట్ర ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, వైస్ ఎంపీపీ బాల్‌రెడ్డి, జడ్పీటీసీ బాలుయాదవ్, పీఏసీఎస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, బీఆర్ఎస్ యూత్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు పాల్గొన్నారు.

మెదక్ గడ్డ.. బీఆర్ఎస్ అడ్డా

తూప్రాన్, ఏప్రిల్ 14: మెదక్ గడ్డ అంటేనే గులాబీ (బీఆర్ఎస్) అడ్డా అని, మెదక్ గడ్డ మీద గులాబీ జెండా ఎగరడం ఖాయమని బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఆదివారం తూప్రాన్ పట్టణంలో బస్వన్నగారి సత్యనారాయణగౌడ్ అధ్యక్షతన తూప్రాన్ పట్టణ, తూప్రాన్, మనోహరాబాద్ మండలాల బీఆర్ఎస్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. గజ్వేల్ నియోజకవర్గం మాజీ సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో 50 ఏళ్ల ముందుకు పోయిందన్నారు. తనకు మాయ మాటలు రావని, ప్రజాసేవ కోసం రాజకీయాల్లోకి వచ్చానన్నారు. కలెక్టర్‌గా ఖ్యాతి ఇచ్చిన ఈ (మెదక్) గడ్డే నాకు రాజకీయ జీవితం కూడా ఇవ్వాలని పేర్కొన్నారు. కలెక్టర్‌గా పరిపాలనా అనుభవంతో మీ సమస్యలను సులువుగా పరిష్కరిస్తానని హామీఇచ్చారు. జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, ఎమ్మెల్సీ యాదవరెడ్డి, రాష్ట్ర ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, టీఎస్ ఎంఐడీసీ మాజీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాఘవేందర్‌గౌడ్ ప్రసంగించారు.

కలెక్టర్‌గా ఆదరించారు.. ఎంపీగా ఆశీర్వదించండి

జగదేవ్‌పూర్, ఏప్రిల్ 14: కలెక్టర్‌గా ఇక్కడికి వంద సార్లు వచ్చానని, నేడు ఎంపీ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నానని, ఆశీర్వదించాలని ఎంపీ అభ్యర్థి వెంకట్రామారెడ్డి కోరారు. ఆదివారం జగదేవ్‌పూర్‌లో జరిగిన జగదేవ్‌పూర్, మర్కుక్ మండల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్సీ యాదవరెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. అబద్ధపు హామీలు, మాయమాటలు చెప్పాల్సిన అవసరం తనకు లేదన్నారు. మాజీ కలెక్టర్ వెంకట్రామారెడ్డికి ఓటేస్తే ట్రస్టు ఏర్పాటు చేసి ఆదుకుంటాడని గ్రామగ్రామాన చాటి చెప్పాలన్నారు. అనంతరం ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. ఎంపీపీ పాండుగౌడ్, జడ్పీటీసీ సుధాకర్‌రెడ్డి, మంగమ్మ రాంచంద్రం, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే దేశాభివృద్ధి


రోడ్‌షోలో ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

జిన్నారం, ఏప్రిల్ 14: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో గత పదేళ్లలో భారతదేశం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని బీజేపీ మెదక్ అభ్యర్థి అన్నారు. ఆదివారం బొల్లారం మున్సిపాలిటీలో నిర్వహించిన ఎన్నికల ప్రచారం రోడ్‌షోలో పాల్గొన్నారు. కేంద్రంలో మోదీ సారథ్యంలో సుస్థిర పాలన, అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుతో దేశాన్ని అన్నిరంగాల్లో అగ్రస్థానంలో నిలిపారని అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా పలు కాలనీలు, ప్రధాన కూడలిలో ఆయన మట్లాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆనందకృష్ణారెడ్డి, నాయకులు రవీందర్‌రెడ్డి, మేఘనారెడ్డి పాల్గొన్నారు.

పొన్నం ప్రభాకర్ ఎందుకు దీక్ష చేశాడో చెప్పాలి

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి డిమాండ్


సమావేశంలో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

హుస్నాబాద్, ఏప్రిల్ 14: రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కరీంనగర్‌లో దీక్ష ఎందుకు చేశాడో చెప్పాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ప్రధాని నరేంద్రమోదీ ఏం చేసిండో నీకు కావాలంటే ఆయన చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలు నాలుగురోజులు చెప్పినా ఒడవదని సూచించారు. ఆదివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగడుతూ చేపట్టిన నిరసన దీక్షలో మాట్లాడారు. మోదీ పాలనలో ఒక్క అవినీతి జరగలేదన్నారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. బీఆర్ఎస్‌ను ఓడించాలనే లక్ష్యంతో కాంగ్రెస్‌కు ఓటు వేశారని, కానీ ప్రజలు మిమ్మల్ని కోరుకోలేదని పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మోరిలో వేసినట్లేనని ఆరోపించారు. పొన్నం ప్రభాకర్ యాక్సిడెంటల్‌గా ఎమ్మెల్యే కావడంతో మంత్రి అయ్యాడని, హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు ఆశీర్వదించకపోతే రాజకీయ జీవితం సమసి పోయేదని విమర్శించారు. అలాగే అంబేడ్కర్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, కోమటిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, లక్కిరెడ్డి తిరుమల, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల్లో జోరుగా అక్రమ కట్టడాలు

- నోటీసులిచ్చి చేతులు దులుపుకుంటున్న అధికారులు
- యథేచ్ఛగా కొనసాగుతున్న నిర్మాణాలు


దుంపలకుంట చౌరస్తాలో ప్రభుత్వ భూమిలో నిర్మిస్తున్న వ్యాపార సముదాయం

కొల్చారం, ఏప్రిల్ 14: నిరుపేదలకు ప్రభుత్వం జీవనోపాధి నిమిత్తం పంపిణీ చేసిన ప్రభుత్వ (అసైన్డ్) భూముల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అక్రమ నిర్మాణాలను అరికట్టాల్సిన పంచాయతీ కార్యదర్శి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వ భూములను పరిరక్షించాల్సిన తహసీల్దార్ పట్టించుకోవడం లేదు. దీంతో కొల్చారం మండలంలోని దుంపలకుంట చౌరస్తాలో అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలు జోరుగా సాగుతున్నాయి. అప్పట్లో పలు ఫిర్యాదులు రావడంతో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ నోటీసులు ఇచ్చారు. అయినా నిర్మాణాలు ఆగడం లేదు. గతంలో నిర్మించిన భవనాలను క్రమబద్ధీకరించుకునేందుకు జీవో 58,59 కింద అవకాశం ఇచ్చినా ప్రభుత్వానికి ఎవరూ బకాయిలు చెల్లించకుండా ఎగనామం పెడుతున్నారు. ఎనగండ్ల గ్రామపంచాయతీలోని దుంపలకుంట చౌరస్తా మెదక్- జోగిపేట ప్రధాన రహదారిపై ఉన్నది. ఈ ప్రాంతం కొల్చారం, కౌడిపల్లి, చిలప్‌చెడ్ మండలాల సరిహద్దుగా ఉండడంతో ఇక్కడి స్థలాలకు రెక్కలు వచ్చాయి. కాగా దుంపలకుంట చౌరస్తాలో రోడ్డుకు ఇరువైపులా సర్వే నెంబరు 330లో మొత్తం 400 ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నది. ఇక్కడి స్థలాలకు డిమాండ్ ఉండడంతో ప్రభుత్వ భూమికి కూడా గుంటకు రూ.10 నుంచి 15 లక్షల వరకు ధర పలుకుతోంది. ప్రభుత్వ భూమి అని తెలిసినా కొంతమంది కొనుగోలు చేసి గ్రామపంచాయతీ నుంచి అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేపడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి అందినకాడికి దండుకుని అక్రమ నిర్మాణానికి ఇంటి నెంబర్ ఇస్తున్నాడని ఆరోపణలు ఉన్నాయి. అసైన్డ్ భూముల్లో అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు రావడంతో పంచాయతీ కార్యదర్శి ఇప్పటికీ రెండుసార్లు నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. ప్రభుత్వ అసైన్డ్ భూముల్లో తాము నోటీసులు మాత్రమే ఇస్తామని, తదుపరి చర్యలు తహసీల్దార్ తీసుకుంటారని కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు.

ధాన్యం కొనుగోళ్లలో ఇబ్బందులు కలిగించొద్దు

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్
- మాచవరం ధాన్యం కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ


మాచవరంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, ఏప్రిల్ 14: ధాన్యం కొనుగోళ్లలో రైతులకు ఇబ్బంది కలిగించొద్దని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. ఆదివారం మెదక్ మండలం మాచవరం గ్రామంలో ప్యాక్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. జిల్లాలో 410 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నామన్నారు. తూకంలో పారదర్శకంగా ఉండాలని సూచించారు. గ్రేడ్-ఏ రకానికి రూ.2203లు, గ్రేడ్-బీ రకానికి రూ.2183ల మద్దతు ధర నిర్ణయించినట్లు తెలిపారు. కొనుగోళ్ల కేంద్రాల్లో పుస్తకాల నిర్వహణ, తేమశాతం, గన్నీ బ్యాగుల కొరత లేకండా చూడాలన్నారు.

తేమశాతం సరిపోతే తరుగు తీసేయకండి

కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకొచ్చిన ధాన్యం తేమశాతం సరిగ్గా ఉన్నప్పుడు ధాన్యానికి తరుగు లేకుండా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యం రవాణా విషయంలో ఎటువంటి సమస్యలు తలెత్తినా సంబంధిత సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీసీవో అరుణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

డొమెస్టిక్ నుంచి కమర్షియల్‌కు..

- రాయపోల్ భారత్ గ్యాస్ గోదాంలో కుంభకోణం
- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పోలీసులు


రాయపోల్ భారత్ గ్యాస్ గోదాంలో డొమెస్టిక్ సిలిండర్ల నుంచి కమర్షియల్ సిలిండర్లకు రీఫిల్ చేస్తున్న దృశ్యం

రాయపోల్, ఏప్రిల్ 14: అక్రమార్కులు పేదల గ్యాస్ సిలిండర్లను కూడా వదలడం లేదు. కొన్ని సిలిండర్ల నుంచి రెండు, మూడుకిలోల గ్యాస్‌ను, మరికొన్ని సిలిండర్లను పూర్తిగా కమర్షియల్ సిలిండర్లకు రీఫిల్ చేస్తూ పేదలకు కుచ్చుటోపీ పెడుతున్నారు. ఈ క్రమంలో రాయపోల్‌లోని భారత్ గ్యాస్ గోదాం నిర్వాహకుల అక్రమ దందా వెలుగులోకి వచ్చింది. రాయపోల్ మండల కేంద్రంలో సుమారు రెండేళ్ల క్రితం భారత్ డొమెస్టిక్ గ్యాస్ గోదాం మంజూరైంది. ఇక్కడి నుంచి ప్రతిరోజు మండలంలోని ఆయా గ్రామాల గృహ వినియోగదారులకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్లు సరఫరా చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో రాయపోల్‌లోని అభివర్షన్ భారత్ గ్యాస్ గోదాం నిర్వాహకులు అక్రమాలకు తెర లేపారు. కొంతకాలంగా గుట్టుచప్పుడు కాకుండా ఒక్కో డొమెస్టిక్ సిలిండర్లలోని గ్యాస్‌ను రెండు, మూడు కిలోలు, ఒక్కో సిలిండర్‌ను పూర్తిగా కమర్షియల్ సిలిండర్లకు రీఫిల్ చేస్తూ హైదరాబాద్‌లోని వివిధ హోటళ్లు, రెస్టారెంట్లకు తరలిస్తున్నారు. నమ్మదగిన సమాచారం మేరకు పోలీసులు ఆదివారం సాయంత్రం గోదాంపై ఆకస్మిక దాడిచేయగా డొమెస్టిక్ సిలిండర్ల నుంచి కమర్షియల్ సిలిండర్లలోకి గ్యాస్‌ను డంపు చేస్తుండగా, రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సిలిండర్లను స్వాధీనం చేసుకొని కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రఘుపతి తెలిపారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్ ప్రశ్నార్థకం

- రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు

గజ్వేల్, ఏప్రిల్ 14: మాదకద్రవ్యాలకు యువత బానిసలుగా మారిపోతున్నారని, తద్వారా వారి భవిష్యత్‌తో పాటు దేశ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారుతున్నదని గజ్వేల్ రౌండ్‌టేబుల్ సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. గజ్వేల్ పట్టణంలోని డౌట్‌టౌన్‌లో ఆదివారం 'మార్పు కోసం-భవిష్యత్ వైపు' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పాల్గొని తమ అభిప్రాయాలను వ్యక్త పరిచారు. యువత రోజురోజుకు మాదకద్రవ్యాలకు బానిసలుగా మారిపోతున్నారని, గ్రామీణ స్థాయికి గంజాయి, డ్రగ్స్ చేరడం పట్ల వక్తలు ఆవేదన వ్యక్తం చేశారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని తగ్గించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని, ప్రతిఒక్కరూ యువతకు మాదకద్రవ్యాల వినియోగంతో కలిగే నష్టం గురించి వివరించాలని అభిప్రాయపడ్డారు. వక్తలు సుభాష్ చంద్రబోస్, మల్లికార్జున్, టీఎన్జీవో డివిజన్ అధ్యక్షుడు బి.లింగం, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య, మాల మహానాడు నాయకుడు శ్రీనివాస్, ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి ప్రశాంత్, విశ్రాంత వార్డెన్ రాజేశం, ప్రగతి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ మట్టయ్య చౌదరి, బీఎస్పీ నాయకులు వినోద్, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

అక్బర్‌పేట-భూంపల్లి, ఏప్రిల్ 14: అప్పులబాధతో రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామానికి చెందిన మేటి మల్లయ్య(48) తనకున్న ఐదున్నర ఎకరాల భూమిలో సుమారు 9 బోర్లను తవ్వించినా చుక్కనీరు రాలేదు. సుమారు రూ.6 లక్షల అప్పుకావడంతో మల్లయ్య ఆదివారం ఉదయం ఇంటి పక్కనున్న పశువుల పాకలో తన తలపాగతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య కళవ్వ, కుమారుడు మహేష్ ఉన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు భూంపల్లి ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు.

సంగారెడ్డిలో ఉత్సాహంగా 'రన్ ఫర్ అంబేడ్కర్'


సంగారెడ్డిలో అంబేడ్కర్ పరుగు నిర్వహిస్తున్న టాస్ నాయకులు

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 14: సంగారెడ్డిలో తెలంగాణ అంబేడ్కర్ సేవా సమితి(టాస్)ఆధ్వర్యంలో 'రన్ ఫర్ అంబేడ్కర్' కార్యక్రమాన్ని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక ఐబీ నుంచి పాత బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం వరకు రన్ నిర్వహించారు. యువకులు, అంబేడ్కర్‌వాదులు, మేధావులు పెద్దఎత్తున రన్‌లో పాల్గొన్నారు. సీనియర్ దళిత నాయకుడు నాగయ్య జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. ఈ ఈ సందర్భంగా టాస్ రాష్ట్ర అధ్యక్షుడు జగన్ మాట్లాడుతూ నేటి యువతకు అంబేడ్కర్ చేసిన త్యాగాలు, విజ్ఞానం తెలిపేందుకు ప్రతిఏటా ఈ రన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సీనియర్ దళిత నాయకుడు రామారావు, యువజన సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు కూనవేణు పాల్గొన్నారు.

భక్తులతో ఏడుపాయల కిటకిట


భక్తులతో కిటకిటలాడుతున్న అమ్మవారి ఆలయ ప్రాంగణం

పాపన్నపేట, ఏప్రిల్ 14: ఏడుపాయల వనదుర్గామాత ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం సెలవు కావడంతో ఉమ్మడి జిల్లావాసులతో పాటు పరిసర జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, జంట నగరాలు, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన భక్తులే తరలివచ్చారు. తెల్లవారుజామున 5 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్ర నామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మంజీరానది పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు బోనాలు, ఒడి బియ్యం సమర్పించారు. ఆలయ సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కొమురవెల్లిలో భక్తజన హోరు


మల్లన్న నిత్య కల్యాణంలో భక్తులు

చేర్యాల, ఏప్రిల్ 14 : కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు గత సోమవారం నిర్వహించిన అగ్నిగుండాలతో ముగిసినప్పటికీ భక్తజన హోరు కొనసాగుతున్నది. మల్లన్న దర్శనార్థం ఆదివారం వేలాదిమంది భక్తులు తరలిరావడంతో ఆలయపరిసరాలు కిటకిటలాడాయి. భక్తులు మొక్కుబడి తలనీలాలు సమర్పించి ఆలయ కోనేటిలో స్నానమాచరించారు. ప్రత్యేక, ఉచిత దర్శ దర్శనం క్యూలో రద్దీ కొనసాగడంతో స్వామివారి దర్శనానికి గంటకు పైగానే సమయం పట్టింది. అలాగే పట్నాలు వేసిన భక్తులతో ముఖమండపం, గంగిరేగుచెట్టు ఆలయ ప్రాంగణాలు జనాలతో సందడిగా మారింది. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏఈవో బుద్ధి శ్రీనివాస్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మల్లన్నకు కాజు, యాలకులు, బాదాం మాల

కొమురవెల్లి మల్లన్నకు హైదరాబాద్‌కు చెందిన భక్తుడు జయపాల్ అరుదైన మాలను బహూకరించారు. కాజు, బాదాం, యాలకులతో ప్రత్యేకంగా తయారు చేసిన మాలను ఆదివారం స్వామివారికి అలంకరింపజేశారు.

అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దాం

రాజ్యాంగ నిర్మాత, భారతరత్న బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆశయాలను కొనసాగిద్దామని ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. ఆదివారం అంబేడ్కర్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యాలయాల వద్ద అంబేడ్కర్ చిత్రపటాలకు అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ నిర్మాణంలో ఆయన కృషిని కొనియాడారు. -ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్


రాయికోడ్‌లో..


ఖేడ్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి, మాజీ ఎంపీ సురేష్ షెట్కార్


సంగారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, ప్రభాకర్


పటాన్‌చెరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించిన ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి


అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మెదక్ ఎస్పీ బాలస్వామి


సంగారెడ్డిలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎస్పీ రూపేష్


నర్సాపూర్‌లో నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి


జహీరాబాద్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు


మనోహరాబాద్ మండలం దండుపల్లి గ్రామంలో..


పెద్దశంకరంపేటలో..


వెల్దుర్తిలో..


అల్లాదుర్గం మండలం చిల్వర్ గ్రామంలో..


పుల్‌కల్: తాడ్దానిపల్లిలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్


హవేళిఘణపూర్‌లో..


చిన్నశంకరంపేటలో..


రేగోడు మండలం పోచారంలో..


జిన్నారంలో..


వట్‌పల్లిలో..


కొల్చారంలో..


కోహీర్ మండలంలోని బిలాల్‌పూర్ గ్రామంలో..


చిలప్‌చెడ్ మండలం గంగారంలో..


గుమ్మడిదలలో రక్తదాన శిబిరం


మునిపల్లి మండలం ఖమ్మంపల్లిలో..


కల్హేర్ మండలంలోని మాసాన్‌పల్లిలో..

అంగన్‌వాడి సెంటర్‌లో చోరీ

శివ్వంపేట, ఏప్రిల్ 14: శివ్వంపేట మండలం కొత్తపేట గ్రామ అంగన్‌వాడీ సెంటర్‌లో దుండగులు శనివారం రాత్రి చోరీకి పాల్పడినట్లు శివ్వంపేట పోలీసులు తెలిపారు. అంగన్‌వాడీ సెంటర్ తాళాలు పగులగొట్టి, 19 పప్పు ప్యాకెట్లు, 9 ఆయిల్ పాకెట్లు, గ్యాస్ సిలిండర్‌ను ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు

సీఎంను కలిసిన మాజీ ఎమ్మెల్సీ

నారాయణఖేడ్, ఏప్రిల్ 14: మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్ ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. నారాయణఖేడ్ నియోజకవర్గంలోని గిరిజన తండాల అభివృద్ధికి నిధులను కేటాయించాలని కోరారు. శాసనసభ ఎన్నికల సమయంలో ఖేడ్ నియోజకవర్గంలోని తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తామన్న విషయాన్ని ముఖ్యమంత్రికి గుర్తు చేశానని రాములునాయక్ తెలిపారు. దీంతో స్పందించిన ముఖ్యమంత్రి పార్లమెంట్ ఎన్నికల అనంతరం తండాల అభివృద్ధికి నిధులు కేటాయించి, ఇచ్చిన మాట నిలుపుకుంటామని సీఎం హామీ ఇచ్చినట్లు రాములునాయక్ తెలిపారు.

అంబలి కేంద్రం ప్రారంభం

వట్‌పల్లి, ఏప్రిల్ 14: పోతులబొగుడ గ్రామానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు చంటి ప్రభు తన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆదివారం వట్‌పల్లిలో జడ్పీటీసీ అపర్ణతో కలిసి అంబలి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పత్రి విట్టల్, యూత్ కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు కచ్చారావు, మల్లికార్జున్, శ్రీహరి, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు


ఎమ్మెల్యే రోహిత్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన అశ్విని

రామాయంపేట, ఏప్రిల్ 14: బీజేపీ జిల్లా మహిళా మోర్చా కార్యదర్శిగా పనిచేసిన అశ్విని ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. రామాయంపేటలో ఎమ్మెల్యే రోహిత్‌రావు సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. కాగా రామాయంపేటలో జరిగిన ఆర్యవైశ్య సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఆర్యవైశ్యులు వ్యాపారంలోనే కాదు రాజకీయంగా కూడా ఎదగాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. అనంతరం టీపీసీసీ కార్యదర్శి సుప్రభాతరావుతో కలిసి అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మండలంలోని ప్రగతి ధర్మారంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొని పూజలు నిర్వహించారు.

రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్‌పై విమర్శలా?

- ఎమ్మెల్యే సునీతారెడ్డిపై నర్సాపూర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి సుజాత ఫైర్

హత్నూర, ఏప్రిల్ 14: రాజకీయ భిక్ష పెట్టిన కాంగ్రెస్ పార్టీపై తప్పుడు ఆరోపణలు చేయడం ఎమ్మెల్యే సునీతారెడ్డికి తగదని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఎం.ఏ.హకీమ్, నర్సాపూర్ నియోజకవర్గ మహిళా కాంగ్రెస్ ఇన్‌చార్జి దానంపల్లి సుజాతసత్యం మండిపడ్డారు. ఆదివారం హత్నూరలో వేర్వేరుగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. అందుకోసమే ప్రజలు బీఆర్ఎస్‌ను బొందపెట్టి తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీకి అధికారం కట్టబెట్టారని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులను అనుభవించి తన స్వార్థం కోసం బీఆర్ఎస్ పార్టీలో చేరి మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా పనిచేసిన సునీతారెడ్డి మహిళలకు చేసిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి బీఆర్ఎస్ ప్రభుత్వంలో కలెక్టర్‌గా పని చేసి అనేక భూములను ఆక్రమించాడని, ఆస్తుల రక్షణ కోసం రాజకీయాల్లోకి వచ్చాడని ఆరోపించారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధును భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు కర్రె కృష్ణ, మాజీ అధ్యక్షుడు పొట్లచెర్వు కిష్టయ్య, మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు సత్యం, కాంగ్రెస్ అధ్యక్షుడు వరిగుంతం కృష్ణ, విజయ్‌కుమార్, శేరి వెంకటేశం, బాలరాజ్, స్వామి, హనుమంతు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

టిప్పర్ ఢీకొని యువకుడి మృతి

మెదక్ అర్బన్, ఏప్రిల్ 14: టిప్పర్ ఢీకొని యువకుడు మృతి చెందిన సంఘటన ఆదివారం మెదక్ పట్టణంలోని బస్‌డిపో సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని నర్సుఖేడ్‌కు చెందిన దూదేకుల సల్మాన్(29) ప్లంబర్. మధ్యాహ్నం ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బంధువును న్యూబస్టాండ్ దగ్గర దింపి తిరిగి వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో టిప్పర్ సల్మాన్ తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య అర్షియాబేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొని ఒకరికి గాయాలు

కౌడిపల్లి: ద్విచక్రవాహనాన్ని కారు బలంగా ఢీ కొనడంతో ఒకరు తీవ్ర గాయాల పాలైన సంఘటన మండల పరిధిలోని రాయిలపూర్ గేట్ సమీపంలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని జాజి తండాకు చెందిన అంబర్యానాయక్ కౌడిపల్లి వైపు నుంచి తండాకు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. రాయిలపూర్ శివారులో వెనుక వైపు నుంచి అతి వేగంగా వచ్చిన కారు బలంగా ఢీకొన్నది. దీంతో అంబర్యానాయక్‌కు బలమైన గాయలు కావడంతో చికిత్స నిమిత్తం నర్సాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

కారును ఢీకొట్టిన టిప్పర్..

నారాయణఖేడ్: నారాయణఖేడ్ జంట గ్రామమైన మంగల్‌పేటలో ఆదివారం సాయంత్రం రోడ్డుపైకి వస్తున్న కారును టిప్పర్ ఢీ కొట్టింది. మున్సిపల్ కార్యాలయం పక్క వీధిలో నివాసం ఉంటున్న ఉపాధ్యాయుడు హిరామన్ కారులో రోడ్డు పైకి వస్తుండగా, ప్రధాన రోడ్డు గుండా వెళ్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో కారు ముందుభాగం నుజ్జునుజ్జు అయింది. కారు నడుపుతున్న హిరామన్ క్షేమంగా బయటపడ్డాడు.

కేంద్రాల వద్ద ధాన్యంతో రైతుల పడిగాపులు

- ఇంకా మొదలు కాని కొనుగోళ్లు

నర్సాపూర్, ఏప్రిల్ 14: వరి పంట చేతికి రావడంతో గ్రామాల్లో ముమ్మరంగా కోతలు కొనసాగుతున్నాయి. కొందరు రైతులు ఇప్పటికే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి నిరీక్షిస్తున్నారు. గత రెండుమూడు రోజులుగా వర్షం కురిసే సూచనలు కనిపిస్తుండడం, ఇంకా కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వర్షం కురిస్తే చేతికొచ్చిన పంట పాడై కష్టానికి ఫలితం లేకుండా పోతుందనే ఆవేదనలో ఉన్నారు. వర్షం వస్తే ధాన్యం తడవకుండా రైతులకు కేంద్రాల వద్ద టార్పాలిన్లు ఇవ్వాల్సి ఉండగా చాలా కేంద్రాల్లో ఇవ్వడం లేదు. నర్సాపూర్ మండలంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో కొనుగోళ్ల కేంద్రాలు ఇప్పటికే ప్రారంభం కాగా కొనుగోళ్లు మాత్రం ఇంకా ప్రారంభం కాలేదు. దీంతో చాలా కేంద్రాల వద్ద రైతులు ధాన్యం తెచ్చి ఎప్పుడు కొనుగోలు చేస్తారా అని ఎదురు చూస్తున్నారు. త్వరగా కొనుగోళ్లు ప్రారంభించి నష్టపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు. కాగా ఈ విషయమై ఐకేపీ ఎపీఎం గౌరిశంకర్‌ను సంప్రదించగా.. ఒకటిరెండురోజుల్లో కొనుగోళ్లు ప్రారంభిస్తామని చెప్పారు.


చిప్పల్‌తుర్తిలో కేంద్రం వద్ద రైతులు ఆరబోసిన ధాన్యం

చిత్తడిగా ఎన్‌జీ.హుక్రాన రోడ్డు


ఎన్‌జీ.హుక్రాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మనూరు, ఏప్రిల్ 14: మండలంలోని ఎన్‌జీ.హుక్రాన రోడ్డు చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి బీటీ రోడ్డు చిత్తడిగా మారింది. దీంతో అతిమ్యాల్ నుంచి ఎన్‌జీ.హుక్రాన వరకు ఉన్న గుంతల రోడ్డుపై నీరు నిలిచి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడుతున్నది. ఈ గ్రామ ప్రజలు నియోజకవర్గ కేంద్రమైన నారాయణఖేడ్‌కు గానీ, మండల కేంద్రమైన మనూరుకు గానీ వెళ్లడానికి నరకయాతన పడుతున్నారు. ఎండాకాలంలోనే ఈ పరిస్థితి ఏర్పడితే వర్షాకాలంలో ఏవిధంగా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ రోడ్డు పునర్ నిర్మాణం చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఖేడ్‌లో వాహనాల తనిఖీ

నారాయణఖేడ్, ఏప్రిల్ 14: నారాయణఖేడ్ పట్టణ శివారులో ఆదివారం సాయంత్రం ఎస్ఐ విద్యాచరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు నారాయణఖేడ్‌లో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పాల్గొని తిరిగి వెళ్తుండగా ఆయన వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు.

కార్యకర్తల అభిప్రాయం మేరకే నిర్ణయం

- కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ శ్రీనివాస్‌గౌడ్

పెద్దశంకరంపేట, ఏప్రిల్ 14: కార్యకర్తల అభిప్రాయం మేరకు త్వరలో రాజకీయ నిర్ణయాన్ని ప్రకటిస్తామని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, కేంద్ర ఫుడ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ విగ్రాం శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. ఆదివారం పెద్దశంకరంపేటలోని ఆయన నివాసంలో మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వారి అభిప్రాయాలు సేకరించారు. అందరి అభిప్రాయం మేరకు రాజకీయ భవిష్యత్తుపై త్వరలోనే నిర్ణయం తీసుకోనున్నట్లు శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.

నల్ల పోచమ్మ జాతరలో బండ్ల ఊరేగింపు


ఎడ్ల బండ్లను ఊరేగిస్తున్న దృశ్యం

చిలప్‌చెడ్, ఏప్రిల్ 14: మండలం పరిధిలోని జగ్గంపేట గ్రామంలో ఆదివారం నల్ల పోచమ్మజాతరలో భాగంగా బండ్ల ఊరేగింపు కనుల పండువగా సాగింది. జాతరలో రెండవ రోజైన ఆదివారం గ్రామానికి చెందిన బండ్లతో పాటు ఇతర గ్రామాలకు చెందిన భక్తులు కూడా బండ్ల ఊరేగింపులో పాల్గొన్నారు.

హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన

కొల్చారం: వరిగుంతం గ్రామంలో హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. రెండోరోజు ఆదివారం హోమం నిర్వహించారు. వేదపండితుడు సాంబశివశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఘనంగా సీతారాముల పల్లకీ సేవ

నారాయణఖేడ్/పెద్దశంకరంపేట: శ్రీరామ నవమిని పురస్కరించుకొని పెద్దశంకరంపేటలో సీతారాముల పల్లకీ సేవ వైభవంగా నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో గరుడ వాహనంపై ఆదివారం సీతారాముల ఉత్సవ విగ్రహాలను ఉంచి పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు, ఎంపీపీ జంగం శ్రీనివాస్ పాల్గొన్నారు. ఖేడ్ పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా రెండవ రోజు ఆదివారం అఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది.

కేసీఆర్ మాయల ఫకీర్‌లాంటివాడు

- బీఆర్ఎస్ పని అనిపోయింది
- టీవీ సీరియల్ ఎపిసోడ్‌లా రేవంత్‌రెడ్డి పాలన
- బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్

టేక్మాల్, ఏప్రిల్ 14: మాజీ సీఎం కేసీఆర్ మాయల ఫకీర్ లాంటివాడని, డబుల్ బెడ్‌రూమ్‌ల ఆశ చూపి ఓట్లు దండుకున్నాడని బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ విమర్శించారు. ఆదివారం సాయంత్రం మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలోని పల్వంచ గ్రామంలో జహీరాబాద్ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని, ఆ పార్టీ మునిగిపోయిన పడవ అన్నారు. కాంగ్రెస్‌లో పక్కోడి కాళ్లు గుంజే రాజకీయం ఉందని విమర్శించారు. కాళేశ్వరంలో లక్ష కోట్ల అవినీతి జరిగింది అని చెప్పి విచారణ పేరుతో ఎందుకు వదిలేశారని, రేవంత్‌రెడ్డి పాలన టీవీ సీరియల్ ఎపిసోడ్‌లా సాగుతున్నదని విమర్శించారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో రోజు పాత్రధారిని విచారిస్తున్నారని, అసలు సూత్రధారులు ఎవరో తెలియాలన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ తోడు దొంగలని దుయ్యబట్టారు. కాంగ్రెస్ నాయకులు రాహుల్ కోసం బానిసలుగా పని చేస్తున్నారని, కేసీఆర్ ఆయన కొడుకు, కూతురు కోసం పని చేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ దేశ ప్రజల కోసం 24 గంటలు పనిచేస్తున్నారని చెప్పారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో సంచలన నిర్ణయాలు ఉంటాయన్నారు. తెలంగాణలో 17 పార్లమెంట్ సీట్లు బీజేపీ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి బీబీ పాటిల్‌ను గెలిపించే బాధ్యత ప్రతి ఒక్క కార్యకర్తపై ఉన్నదని వివరించారు. ఖద్దరు దుస్తులు కాదు.. కార్యకర్తలే ముఖ్యమని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. అనంతరం బీబీ పాటిల్ మాట్లాడారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు గంగారాం విజయపాల్‌రెడ్డి, యెండెల లక్ష్మీనారాయణ, అరుణతార, బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి, పార్లమెంట్ ప్రబారి పెద్దల గంగారెడ్డి, ఆలే భాస్కర్, నారాయణఖేడ్ నియోజకవర్గ ప్రబారి సంగప్ప, జిల్లా నాయకులు శ్యామయ్య, రాజు, మండలాధ్యక్షుడు నవీన్, ప్రధాన కార్యదర్శి సిద్ధిరాములు, నాయకులు వడ్డేరాములు, పవన్, సేనాపతి, మధుసూదన్‌రెడ్డి, శంకర్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్, పక్కన బీబీపాటిల్

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ దాడి

- ఎనిమిది మంది పేకాటరాయుళ్ల అరెస్టు

కొల్చారం, ఏప్రిల్ 14: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అదుపులోకి తీసుకున్న సంఘటన కొల్చారం మండలంలో చోటు చేసుకుంది. ఎస్ఐ మహ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రంగంపేటలో పేకాట ఆడుతున్నారన్న నమ్మదగిన సమాచారం మేరకు మెదక్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు శనివారం సాయంత్రం ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎనిమిది మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకుని, వారిని రూ.14,000 నగదును స్వాధీనం చేసుకున్నారు. వారిని కొల్చారం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు ఏఎస్ఐ తారాసింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.